# జీవన సమరం

2005 క్రేన్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ




**చిల్లర సాంబశివరావు**

**అ**మాయక ప్రజలను దోచుకునే భూస్వాములున్నంత వరకు పల్లెల్లో జీవించే బడుగుజీవుల అభ్యున్నతి కనుచూపుమేరలో కనిపించదనేమాట నగ్నసత్యం!

స్వాతంత్ర్యం వచ్చి యాభై ఎనిమిదేళ్ళయినా ఈనాటి వరకు స్వేచ్ఛకు నోచుకోని జీవితాలెన్నో!

ఒంటరి పోరాటంతో ఎన్నాళ్ళీ విధంగా కష్టజీవులు ఆకలి చావులతో సుఖానికి దూరమై నరకయాతన అనుభవించగలరు?

తరాలు మారినా, యుగాలు మారినా, దారిద్ర్యరేఖకు దిగువన వున్న ప్రజానీకం యధాతథంగా వారసత్వ విధానంగా గుడిసెల్లోనే మ్రగ్గుతూ దయనీయమైన జీవితం గడుపుతున్నారు!

ఎంతోమంది, ఎన్నో సంవత్స రాల తరబడి ఉద్యమాలు నడిపి సమసమాజ స్థాపన కోసం అవిరళ కృషి జరుపుతూనే వున్నారు!

అయినా సమాజం మాత్రం స్వార్థపరులతో నిండిపోతూనే ఉన్నది!

ఎవర్ని చూసినా ప్రక్క వాడ్ని దోచుకునే ధోరణినే అవలంభించడంవలన బడుగు జీవుల జీవనస్థితిగతులు నానాటికీ అధోగతికి చేరు కుంటున్నాయి!

✦ ✦ ✦

కాగితాలకే పరిమితమై పోతున్న రాజ్యాంగ సూత్రాలు. చట్టం కళ్ళుకప్పి యధేచ్ఛగా అవినీతి పనులు కొనసాగి స్తున్న బడా కామందులు నేటి సమాజాన్ని వక్రమార్గం పట్టిస్తున్నారు !

✦ ✦ ✦

అదొక కుగ్రామం !

అక్కడ జనాభా రెండువేలకు మించి వుండదు.

ఆ ప్రాంతంలో వున్న భూస్వామి రాయుడు ఆ చిన్న పల్లెను పరిపాలిస్తున్నాడని చెప్పవచ్చు!

వందల ఎకరాల భూమిని ఆ రాయుడు తన సొంతం చేసుకున్నాడు !

నిరుపేదలకు పంపిణీ చేసిన బంజరు భూములను సైతం తనకున్న

బ్లాక్‌మనీతో అతి తక్కువ రేటుకే వాళ్ళవద్ద కొని ఆ పొలాన్ని ఆ నిరుపేదల చేతనే సాగు చేయిస్తున్నాడు !

బంజరు భూములను బాగు చేయించుకునే స్తోమతలేక ప్రభుత్వం వాళ్ళకిచ్చిన కొద్దిపాటి భూమిని ఆ రాయుడికే తెగనమ్మి కొన్నాళ్ళు ఆ నిరుపేదలు జీవనం సాగించారు.

ఇప్పుడు తినటానికి తిండి లేక వాళ్ళంతా ఆ రాయుడి దగ్గరే వ్యవసాయ కూలీలుగా బ్రతుకుతున్నారు!

ఆ రాయుడు వాళ్ళను పోషిస్తున్నానని పైకి చెబుతూనే వాళ్ళచేత వెట్టి చాకిరి చేయిస్తున్నాడు!

ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది.

✦ ✦ ✦

"ఒరేయ్ వెధవల్లారా! ఎక్కడ చచ్చార్రా?" కేక పెట్టాడు భూస్వామి రాయుడు.

"ఇక్కడే ఉన్నం దొరా... ఏం చేయాల?" అన్నారు వాళ్ళు అక్కడికి చేరుకుంటూ

"పొలం పని చెయ్యాలిరా.... మీ కిచ్చిన బంజరు భూమిని నేను కొన్నందుకు బాధపడుతున్నాను. ఇప్పటి కైనా పొలం వెళ్ళి రాళ్ళు రప్పలు శుభ్రం చెయ్యండిరా..." అంటూ అరిచాడు రాయుడు వాళ్ళ వంక చూస్తూ.

"చేస్తూనే వున్నం దొరా పదిరోజుల్నుంచి... కాని ఏం లాభంలేదు..." అన్నారు వాళ్ళు.

"ఏందువల్ల?"

"ఆ భూమి సేద్యానికి పనికిరాదు దొరా..." అన్నాడు కొద్దిగా చదువుకున్న దళితవర్గ నాయకుడు వెంటనే.

"ఎవరు చెప్పారు?" బిగ్గరగా అరిచాడు రాయుడు అతని వంక చూస్తూ.

"నేనే చెబుతున్నాను దొరా..." అన్నాడతను.

"నువ్వెవరు? నీ ముఖం కొత్తగా కనిపిస్తున్నది నాకు!" అన్నాడు భూస్వామి.

"నేను ఈ నిరుపేదలకు నాయకుడను దొరా..." బదులిచ్చాడు ఆ వ్యక్తి.

"నువ్వు ఎప్పుడు వచ్చావిక్కడికి?" మండిపడుతూ ప్రశ్నించాడు రాయుడు వెంటనే.

"ఇప్పుడే వచ్చాను దొరా. ఏం రాకూడదా?" అతని జవాబు.

"అవును - నీకు ఇక్కడ స్థానం లేదు" అన్నాడు రాయుడు.

"ఎందుకని?" అడిగాడతను.

"నువ్వు మావోయిస్టుగా కనిపిస్తున్నావ్!" అన్నాడు రాయుడు.

"భయపడకండి మీరు! నేను మావోయిస్టును కాను ఉగ్రవాదిని అంతకంటే కాదు".

"మరి నువ్వు ఎవరు?"

"నేనొక సామాన్యుడను. వీళ్ళకు న్యాయం చేయటానికి వచ్చాను".

"అంటే నేను వీళ్ళకు అన్యాయం చేస్తున్నానా?" ఎదురు ప్రశ్న వేశాడు రాయుడు.

"అవును. మీరు వీళ్ళ చేత వెట్టిచాకిరి చేయిస్తున్నారు! వీళ్ళ భూమిని మీరు సొంతం చేసుకున్నారు. అంతే కదూ?"

"కాదు. వీళ్ళను అడుగు, చెప్తారు. డబ్బు ఇచ్చి కొనుక్కున్నాను. చెప్పండిరా... అలా నిలబడి చూస్తున్నారెందుకు? నేను చేసిన పని మంచిది కాదా?" అంటూ వాళ్ళ వంకచూశాడు రాయుడు.

వాళ్ళంతా మౌనం వహించారు.

"వాళ్ళు చెప్పలేరు దొరా......వాళ్ళచేత బలవంతంగా మీరు చెప్పించకండి. తిండిలేక; పస్తులుండి చావలేక మీకు అమ్ముకున్నారంతే. మీరు ఎంతో నేర్పుగా చాకచక్యంగా అందరి భూములను మీ సొంతం చేసుకొని మళ్ళీ వాళ్ళ చేతనే వెట్టి చాకిరి చేయిస్తున్నారు. అంతేనా?" అన్నాడతను.

"అవును. చేయిస్తాను. నా ఇష్టం. అడగటానికి నువ్వెవరు?" అన్నాడు రాయుడు.

"ఈ మనిషి మా నాయకుడు దొరా! ఈ రోజు నుంచి వేం ఈయన చెప్పినట్లే నడుచుకుంటాం" ఒకేసారి చెప్పారు ఆ బడుగు జీవులు!

"అలాగా! అయితే ఈ మనిషి మీ బ్రెయిన్‌వాష్ చేశాడన్నమాట!"

"అదంతా మాకు తెల్వదు దొరా.. మేం మాత్రం వెట్టిచాకిరి చెయ్యం...."

"ఏరా! నా సంగతి తెలియదా? నేను తల్చుకుంటే..."

'ఏం చేస్తారు?" ఈసారి నాయకుడు సూటిగా ప్రశ్నించాడు.

"కాల్చి పారేస్తాను"

"కాల్చి పారెయ్యండి. ఎంతమందిని కాలుస్తారో అదీ చూస్తాను. ముందునన్ను కాల్చండి...." అంటూ ముందుకు వెళ్ళాడు నాయకుడు.

రాయుడు సందిగ్ధావస్థలో పడ్డాడు.

✦ ✦ ✦

"ఒసేయ్ మంగీ!" పిలిచింది ముసిల్ది.

"ఏందవ్వా?" గుడిసెలో నుండి బయటకు వస్తూ అడిగింది మంగి.

"నాకు గంజినీళ్ళు పోసెదెప్పుడే?" మూల్గుతూ అంది ముసిల్ది.


"ఇయ్యాళ నూకల్లేవ్! నన్నేం చెయ్యమంటావ్?" చెప్పింది మంగి.

"మన బతుకులిట్టా తెల్లారిపోవల సిందేనా?" అరిచింది ముసిల్ది.

"అవునవ్వా..... ... మంచి నీళ్ళు తాగు.... ఇవ్వమంటావా..." అడిగింది మంగి.

"నా గొంతులో పొయ్యవే... నేను చచ్చి పోతుండా ...." అన్నది ముసిల్ది.

కుండలో నీళ్ళు తెచ్చి ఇచ్చింది మంగి.



గొంతు తడుపుకుంది ముసిల్ది.

"మీ ఆయన ఏడకెళ్ళిండు... పని లేదంటే ... ఇయ్యాళ...." అడిగింది ముసిల్ది.

"లేదంటవ్వా... అందరు ఆసామింటికి పోయింర్రు..."

"ఎందుకంట"

"నాకేమి ఎరుక..."

"నువ్వు పాచిపనికెళ్ళ లేదా?"

"లేదవ్వా... అది కూడ లేదు" జవాబిచ్చింది మంగి.

"ఏమయిందే..."

"ఆళ్ళు వద్దన్నరు... ఎవరో చేత్తున్నరంట..." మెల్లగా పలికింది మంగి.

"అయితే చంటోడి సంగతేందే... పాలు కూడ లేవా..."

"అవ్వా... చంటోడు నిదరపోయిండు... లేచినాక ఏడ్పులంకించుకుంటడు. ఏం జేసేదవ్వా..." దుఃఖం పెల్లుబుకుతుంటే ఆపుకొని చెప్పింది మంగి.

"మంగీ! పొయ్యిలో పిల్లి లేవదు మనకు.. ఎండ నడినెత్తిమీది కొత్తున్నది... నేను బతక నింక...".

"అమ్మా.... నన్నేం జెయ్యమంటవ్. ఊళ్లోకెళ్ళి అడుక్కురావాల!"

"అవునే... ఎళ్ళి అడుక్కురావే..... నేను చచ్చిపోతుండానే..." దీనంగా పలికింది ముసిల్ది.

"చంటోడ్ని కనిపెట్టి చూడు... ఎళు తుండ.... అడుక్కొని వస్తా.... " అంటూ ఊళ్లోకి వెళ్ళింది మంగి.

✦ ✦ ✦

"ఏరా మీరంతా నామాట వింటారా లేదా?" అంటూ పెద్దగా అరిచాడు రాయుడు.

"మేం చెప్పినంగంద... మా నాయకుడు చెయ్యమంటే చేస్తం..." అన్నారంతా.

రాయుడు కళ్ళెర్ర జేశాడు!

"పిల్చుకురండి మీ నాయకుడ్ని..." అన్నాడు. రాయుడు.

"నేనిక్కడే వున్నాను. ఏమిటో చెప్పండి. త్వరగా..." అన్నాడు నాయకుడు.

"ఆఖరిసారిగా చెబుతున్నాను. మీరు నా మాట విని నేను చెప్పినట్లు చేస్తారాలేదా?" అడిగాడు రాయుడు నాయకుడ్ని ఉద్దేశిస్తూ.

"చెప్తాను వినండి. మీరు సొంతం చేసుకున్న భూమిని వీళ్ళకివ్వాలి. అప్పటి వరకు వీళ్ళు పనిలోకి రారు" ఖచ్చితంగా చెప్పాడు నాయకుడు.

"నేను కొన్నాను. ఆ డబ్బు ఎవరిస్తారు?" అన్నాడు రాయుడు. "వీళ్ళ దగ్గర డబ్బు లేదు. తినటానికి తిండి కూడ లేదు".

"అయితే ఏం చెయ్యమంటావ్?"

"మీరే వీళ్ళను బతికించాలి. వీళ్ళు బతికితే గదా మీకు బొక్కసంలోకి రొఖ్ఖం వచ్చేది!" అన్నాడు నాయకుడు.

"సరే. నువ్వు చెప్పినట్లే చేస్తాను. వీళ్ళకి తిండి పెట్టే ఏర్పాటు చేస్తాను. బంజరు భూమిని తిరిగి ఇచ్చే విషయం ఆలోచిస్తాను" చెప్పాడు రాయుడు.

ఇంతలో మంగి వచ్చింది అక్కడికి.

"ఏందే మంగీ? ఎందుకొచ్చినవ్?" అడిగాడు కోటిగాడు తన భార్య వంక చూస్తూ.

"గుడిసెలో ముసిల్ది తిండిలేక చావు బతుకుల్లో ఉందయ్యా... పిడికెడు మెతుకులు కూడా దొరకలేదు..." చెప్పింది మంగి.

"చూశావా రాయుడూ! తిండిలేక ఈ గూడెంలో రోజు కొక మనిషి చస్తున్నాడు! ఇప్పటి కైనా నీ స్వార్థానికి అడ్డుకట్టవేస్తావా?" ఆవేశంతో అన్నాడు నాయకుడు.

"సరే...." అంటూ నిష్క్రమించాడు రాయుడు. మరుక్షణం అందరు గుడిసెలవేపు నడిచారు.

మంగి గబగబ వెళ్ళి ముసిల్దాన్ని చెయ్యి పట్టుకొని చూసింది.

ఒళ్ళంతా చల్లబడిపోయింది!

మంగితల్లి చనిపోయింది!

చంటోడు పాలకోసం గుక్కపెట్టి ఏడుస్తున్నాడు!

ఇదంతా చూస్తున్న సూర్యుడు ఆకాశంలో తనకేమీ పట్టనట్టు ముందుకు సాగిపోతూనే ఉన్నాడు !

## హైకూలు

సెల్ ఫోన్లంటే
పిట్టలకు కోపం
వాలడాన్కి వైర్లుండవని

మా పొలం
పిట్టలకింత పంచి
పంట చేతికిచ్చింది

అద్దం మీదో పిట్ట
యుద్ధం మొదలు
పందెం దేని మీద?

ఎండిన కొమ్మ
దాని ఎదలోతుల్లో
పచ్చని జ్ఞాపకం

ఏ కవి చల్లాడో
వేల అక్షరాలు
నేల పచ్చని కవిత నిచ్చింది

ఆమె చూసింది
కనుల కదలిక
కావ్యమయ్యింది

కురిసిన వానకి
కానుకనివ్వనా?
ఇదిగో ఇంద్రధనస్సు !

వానొచ్చినందుకు
పచ్చని కొమ్మలన్నీ
పుష్పగుచ్చాల్నిచ్చాయి

జన్మనిచ్చేది
అమ్మ ఒక్కటే కాదు
అక్షరం కూడా !

- పి. మోహనరాంప్రసాద్